# పిచ్చుక

ఆ రోజు స్కూలు లేనందుకు మా పాప ముఖం ఎంతో ఆనందంగా ఉంది.

"ఇవాళ మోహన్‌రావు అంకుల్ వాళ్ళింటికి రమ్మన్నారు కదూ నాన్నా... ..." అని గుర్తు చేసింది.

మా కొలీగ్ మోహన్‌రావు ఆ రోజు వాళ్ళింటికి మమ్మల్ని టీకి ఆహ్వానించాడు.

స్నేహితురాలితో హౌస్‌ఫుల్ పిక్చర్‌కు వెళ్ళి వచ్చిన మా ఆవిడ 'తలనొప్పి' అంటూ పడుకుంది.

నేను, పాప మాత్రమే మోహన్‌రావు ఇంటికి బయలుదేరాం.

మా ఆవిడ రానందుకు విచారం వెలిబుచ్చి మోహన్‌రావు మమ్మల్ని లోనికి ఆహ్వానించి తాను కొత్తగా చేయించిన టేబుల్ ముందు కూర్చొపెట్టాడు.

ఆ గదిలోంచి లోపలి గదులకు కనెక్టు చేసిన బెల్‌ను గట్టిగా మూడుసార్లు నొక్కి ఒకసారి భార్యను ఒకసారి కుక్కపిల్లను, ఇంకొకసారి వాళ్ళ అబ్బాయిని రప్పించాడు. కుక్కపిల్ల తప్ప మిగతా ఇద్దరు నమస్కారం చేసి లోనికి వెళ్ళిపోయారు.

డోర్ కర్టెన్ ఇంపోర్టెడ్ క్లాత్ అని, ఆ టేబుల్‌కు ఎనిమిది వందలు అయిందని చెప్పాడు మోహన్‌రావు.

ఈ క్లాత్ ఇండియాలో దొరుకుతుంది గదా అంటె "ఆఁ. అది కాపీ సరుకండీ అసలు క్లాత్ అది కాదు" అన్నాడు

రెండు దశాబ్దాల క్రితం ప్రింటయి జీర్ణావస్థలో నున్న నాలుగైదు నవలలు చూపించి—'మా ఆవిడ నెలకు నాలుగు నవలలైనా కొంటుంది' అన్నాడు.

మాట్లాడుతూ మధ్య మధ్య 'ఈ రోజు పని మనిషి రాలేద'ని కనీసం పది సార్లైనా అన్నాడు.

మరోసారి గట్టిగా బెల్ నొక్కి లోనికి వెళ్ళిన భార్యను పిలిపించాడు.

"ఇంకా పనిమనిషి రాలేదు కదూ...." అని అడిగి వాళ్ళకు పనిమనిషి ఉందన్న విషయాన్ని నాకు రూఢి చేయించాడు.

మెడకున్న బంగారు గొలుసు, దానికి వ్రేలాడే పులిగోరు కనిపించడానికి మోహన్‌రావు పల్చని షర్ట్ వేస్తుంటారు సరిగా కనిపిస్తున్నాయో లేదోనని అప్పు డప్పుడు షర్ట్ బటన్‌లో మీది రెండింటిని పెట్టుకోకుండా అలాగే వదిలేస్తుంటాడు

ఆ రోజు మోహన్‌రావు చీరె లుంగీ కట్టుకొని పల్చని లాల్చీ వేసుకున్నాడు. పొద్దున పాలుతీసుకురావడానికి ఒక 'పని మనిషి' ఉందన్నాడు.

మా అబ్బాయిని పనిమనిషే స్కూలుకు తీసుకుపోయి, తీసుకు వస్తుంది అన్నాడు.

మరోసారి 'ఈ రోజు పనిమనిషి రాలేదు' అని 'పనంతా మా ఆవిడే చేయాల్సి వచ్చింది' అంటూ బాధపడిపోయాడు. అవునూ... మీరు సహాయం చేయ వచ్చుగా.... సరదాగా ఉంటుంది—అని నేనంటే "ఛా! మనం చేయడమేంటి"! అన్నట్లుగా మాట్లాడి ఎంతో గొప్పగా మాట్లాడినట్లు ఫీలయ్యాడు

స్వీట్స్, టిఫిన్లు వచ్చాయి.

స్వీట్స్ ప్లేట్ నా ముందుకు జరుపుతూ "ప్రతి సండే స్వీట్స్ చేసు కుంటాం" అన్నాడు.

ఆపిల్ ముక్కలు అందిస్తూ-"రోజూ ఆపిల్స్ బనానాస్ తెస్తుంటాను. ఫ్రూట్స్ కోసం మంత్లీ సిక్టీ రుపీస్ ఖర్చవుతుంది".

టీ తీసుకున్నాక గట్టిగా బెల్ నొక్కి వాళ్ళ అబ్బాయిని పిలిచి "ఇవాళ పేపర్ రాలేదా"? అని అడిగాడు.

"పక్కింటివాళ్ళు ఊరికి పోయారుగా డాడీ" అన్నాడా అబ్బాయి.

మోహన్‌రావు కొడుకువైపు ఉరిమి చూశాడు. ఆ అబ్బాయి భయపడి లోపలి గదిలోకి పారిపోయాడు

"మా బావమరిది బావమరిది అమెరికాలో ఉన్నాడండీ...."

"మా కో-బ్రదర్ వాండ్లు కాశ్మీర్‌కు వెళ్ళారు.... వాళ్ళు వచ్చేటప్పుడు శాలువాలు తెమ్మన్నాను...."

అలా వాతావరణానికి రంగులు వేయ ప్రయత్నించసాగాడు మోహన్రావు.

"ఈ బస్సుల్లో ప్రయాణం చేయలేమండి ..ఓ వెహికిల్ కొనేద్దామనుకుంటున్నా....వన్‌వీక్‌లో వచ్చేస్తుంది...."

"బ్లాక్‌లోనా ?"

'కాదండీ మాకజిన్ బ్రదర్ స్కూటర్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు నా కోసం ఓ స్పెషల్ వెహికల్ చేయమన్నా చేయిస్తాడు.'

అలా మోహన్‌రావు మాట్లాడుతుండగా ఒక అమ్మాయి వచ్చింది.

పదేళ్ళుంటాయి కాబోలు ఆ అమ్మాయికి.

చింపిరితల ....

భుజాలమీద చిరిగిన బ్లౌజు వేసుకుంది,

రంగు వెలసిపోయిన పొట్టి లంగా వేసుకుంది.

'సార్ మా అవ్వ పంపింది సార్ ' అంది వినయంగా.

'ఎందుకే ?' — ముఖమంతా చిట్లించుకొని అడిగాడు మోహన్‌రావు.

మోహన్‌రావుకు అంత వికృతమైన మొహం ఉన్నట్లు నాకు అంతవరకు తెలియదు!

'పని చేస్తానికి సార్ ....'

"నువ్వా !... పని చేస్తావా? నువ్వేం పనిచేస్తావె పో పో " అని కసురుకున్నాడు.

ఆ అమ్మాయిని.... చిరుగుల లూజ్ బ్లౌజ్‌ను. రంగు వెలిసిన పొట్టి లంగాను చూడసాగింది మా పాప.

ఆ చూపులో నా చూపు ఉంటుందా, మా ఆవిడ చూపు ఉంటుందా అని స్టడీ చేస్తుంటాను

'పని మంచిగనే చేస్తసార్....' అందాఅమ్మాయి ప్రాధేయపడుతూ.

'నువ్వేం పని చేస్తవె...పో దాన్నే రమ్మను పో....' అన్నాడు మోహన్‌రావు.

"మా అవ్వకు పాణంల బాగాలేదు సార్.... లేత్తలేదు. నేను పని మంచి గనే చేస్తాసార్ ....సార్....ఒకసారి చూడుండ్లి సార్...." అంటూ రెండుచేతులూ జోడించింది.

"పోవే....ఇక్కణ్నుంచి పో " అంటూ కసురుకున్నాడు మోహన్‌రావు. అతని మెడలో వున్న పులిగోరు చెయిన్ షర్ట్‌మీదికి వచ్చింది.

ఆ అమ్మాయి బెదిరిపోయింది.

జోడించిన చేతులం నలాగే ఉంచి అతి దీనంగా చూడసాగింది.

లోతుకుపోయిన కళ్ళు

చిక్కిపోయిన ముఖం.

మాసిపోయిన తల.

అరవై ఏళ్ళను మోసే ఆ పదేళ్ళ కాయం వాడిపోయిన మొగ్గలాగుంది.

"పనిచేసి మా అవ్వ పోయిననెల పైసలు అడుక్కరమ్మన్నది సార్ రెండురోజుల్నుంచి బువ్వలేదు. మా తమ్ముడు ఏడుస్తాండు సార్" అంది దోసిలి అలాగే పట్టి

మోహన్‌రావు మండిపడి "రాస్కెల్....ఇక్కణ్నుంచి పోతావా లేదా.. " అంటూ మెడపట్టి కొట్టబోయాడు

నేనాపకపోతే పులిగోరు మెడలో వేసుకున్న మోహన్‌రావు చేతికి ఆ అమ్మాయి ఆహుతి ఆయేదే।

గజగజ వణికిపోయింది.

ఏడుస్తూ బ్లౌజుతో కళ్ళు తుడుచుకుంటూ అక్కణ్నుంచి వెళ్ళిపోయింది.

ఆ తరువాత మోహన్రావు తన వికృత మొహాన్ని నవ్వుతో కడిగేయా లనుకున్నాడు గాని అది మరింత వికృతంగా తయారయింది.

"ఈ పనివాళ్ళు యింతేనండి. వారంలో నాలుగు రోజులు యింట్లోనేవుంటరు. నెలజీతం మాత్రం ఖచ్చితంగ తీసుకుంటరు. బేయిమాన్ మనుషులు అందుకే మన దేశం గిట్లయింది" అన్నాడు.

కొంతసేపు మాట్లాడి వాళ్ళ ఆతిధ్యానికి కృతజ్ఞతలు తెలిపి పాప, నేను మా ఇంటికి బయలుదేరాం.

దారిలో.... బస్టాప్ దగ్గర .. "సార్ మా అవ్వ బాగలేదు సార్ .... రెండు రోజుల్నుంచి బువ్వలేదు.... మాతమ్ముడు ఏడుస్తాడు సార్" రొండు పైస లేయండి సార్ .. అన్న మాటలు వినిపించాయి. ప్రక్కకు తిరిగి చూశాను.... ఆ అమ్మాయే? మా పాపను పంపి దగ్గరికి పిలిపించాను. ఇంకా ఆ కళ్ళలో భయం పోలేదు ....

భయంభయంగా చూస్తూ నా దగ్గరికి వచ్చింది. "నాతో వస్తావా పాపా.... మా ఇల్లు ఇక్కడికి దగ్గరలోనే ఉంది" అని అడిగాను.

వస్తానన్నట్లు తలూపింది.

"పని చూపిస్తారా సార్ ...." అని అడిగింది ఆశగా.

"ఆఁ .. చేస్తావా!"

"చేస్తా సార్"

ఆ చిన్న కళ్ళు విశాలమయ్యాయి. ఆ మొహంలో ఆనందం లీలగా కనిపించింది.

"దీన్నెందుకు తెచ్చావ్!" అంది పదిహేను రూపాయలు ఖర్చుపెట్టి తలనొప్పి కొనుక్కొని పడుకున్న మా ఆవిడ.

"మనింట్లో పనులకు సహాయపడుతుంది నీనా.... " అని అనగానే ఆ అమ్మాయివైపు. నావైపు ఆశ్చర్యంగా చూసింది.

అన్నిరోజులు నీనా పనిమనిషిని పెట్టుకుందాం అంటే వద్దనేవాడిని.

నీనాకు కావలసింది పనికాదు పనిమనిషి వల్ల వచ్చే హోదా! హోదా కోసం పనిమనిషిని పెట్టుకుందాం అనేది.

అందుకే వద్దనేవాడిని.

కాని ఆ రోజు నేనే ఆ అమ్మాయి కమలను మాయింట్లో పనికి కుదిర్చాను.

కమలకు ఏడాది నిండిన తమ్ముడున్నాడు.

పని చేసిచేసి అలసిపోయిన తల్లి ఉంది. ఆమెకు జబ్బు ఉంది.

తండ్రి లేడు. అతడు మిగిల్చిపోయిన ఆస్తి లేదు.

బంధువులు ఉండికూడ లేరు.

వయసు చిన్నది. బాధ్యత పెద్దది!

ఆ అమ్మాయికి బట్టల కుట్టిస్తుంటే "దానికి కొత్తబట్టలెందుకు? ఏ పాత వైనా వేసుకుంటుంది" అంది మా ఆవిడ

"చూడు నీనా! కమలను వెంటబెట్టుకొని నువ్వు షాపింగుకు, కూరగాయ లకు, స్టోర్స్‌కు వెళుతున్నావా? అప్పుడు చిరిగిన బట్టలేసుకొని మన బ్యాగును మోస్తూ కమల నీ వెంట నడుస్తుంటే బాగుంటుందా చెప్పు? కావాలంటే కమలకు ఇవ్వాల్సిన డబ్బుల్లో నెలకింతని పట్టుకుందాంలే" అన్నాను

"అది మంచి బట్టలేసుకొని నా వెంట నడుస్తుంటే ఎవరైనా పనిపిల్ల అను కుంటారా?"

"అనుకోకపోతేనేం?"

"కూతురనుకోరు?"

"అనుకుంటే ఏం?"

"అప్పుడు నా పరువేంగాను?"

"సాటిమనుషులను హీనంగా చూస్తున్నందుకు సిగ్గుపడాలి గాని ప్రేమగా చూస్తున్నందుకు కాదు నీనా! "

ఏమనుకుందో గాని మా ఆవిడ ఇక వాదించలేదు.

ఆ విషయాన్ని వ్యతిరేకించలేదు.

కమలకు తీరికగా ఉన్నప్పుడు చదువు చెప్పసాగాను

"దానికి చదువెందుకు?" మొదట మా ఆవిడ కొంచెం విసుక్కుంది.

"చదువుకున్న నువ్వు వేయాల్సిన ప్రశ్న కాదిది నీనా చదువెందుకు అనేది తినడం ఎందుకు అనేంత పిచ్చిప్రశ్న" అన్నాను

"నీ యిష్టం బాబు ఎవరు వాదిస్తారు నీతో" అంటూ ఊరుకుంది.

కమల బాగా చదివి ఏదైనా ఉద్యోగంలో చేరితే ఆ కుటుంబం బాగుపడు తుంది అన్నది నా ఆలోచన. కాని ఉద్యోగాలు దొరకడం అంత సులభమా? అందులో ఏ ఆసరాలేని కమలలాంటి అమ్మాయికి!

మా ఇంట్లో మా ఆవిడకు ఉద్యోగం, నాకూ ఉద్యోగం!

మా ఇద్దరిలో ఏ ఒక్కరో ఉద్యోగం చేస్తే ఒక నిరుద్యోగికి ఉద్యోగావ కాశం కల్పించిన వాళ్ళమవుతాంగా? కాని, మా ఆవిడను ఉద్యోగానికి పంపి నేను ఇంట్లో కూర్చోగలరా?

అలాగే నేను ఉద్యోగం చేస్తూ మా ఆవిడను ఇంట్లో ఉండమనే హక్కు నాకుందా? ఆమె ఇష్టం. ఉద్యోగం చేయగలిగే వాళ్ళందరికీ అవకాశాలు ఉండే సమయం కోసం ఎదురు చూడటం తప్ప మరో మార్గంలేదు అలా అనుకోవటంలో మాత్రం నాకు తృప్తిలేదు. ఉద్యోగాలు దొరక్క డిగ్రీలు చేతబట్టుకొని కాళ్ళరి గేలా తిరిగే అబ్బాయిలను, అమ్మాయిలను, వాళ్ళ అవసరాలను చూస్తూ గిల్టీగా ఫీలవుతుంటాను.

మా మామగారు మినిష్టర్లను కార్లలో తిప్పుతుంటారు. నాకు, మా ఆవిడకే కాదు మా పాపకు, మా ఆవిడ హోదాకోసం పెంచబోయే కుక్కపిల్లకూ ఉద్యో గాలు యిప్పించగలరు.

ఇంతకూ కమలకు ఉద్యోగం దొరుకుతుందా? లేదా! దొరకవచ్చు సమాజం ఎప్పటికీ ఇలాగే వుంటుందా? కమల పెద్దదయే లోపల మంచి మార్పులు రాకపోవు మా తరం ఎలాగో ఇలాగ బాధలు మింగలేక కక్కలేక వెళ్ళి పోతోంది. కాని నేటితరం మీద ఎందుకో ఆశ కలుగుతోంది. వాళ్ళు తప్పక సమాజాన్ని మారుస్తారు.

"ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అడిగింది నీనా.

"ఏవో పిచ్చి ఆలోచనలు. నావన్నీ పిచ్చి ఆలోచనలనేకదా నీ అభిప్రాయం" అన్నాను

"సెంట్ పర్సెంట్ కరెక్ట్ - ఆ పిచ్చి ఆలోచనలతో నీ తల ఎక్కడ పుచ్చిపోతోందోనని జాలివేస్తోంది."

"నా మీద అంత జాలి ఉందా నీనా నీకు?"

"ఆ విషయం నిన్ను పెళ్ళి చేసుకున్నప్పుడే అర్థంకాలా?"

"అయితే జాలిపడి చేసుకున్నావా నన్ను?"

"మరి! అత్తయ్యవచ్చి నువ్వు చెడిపోతున్నావని ఏడుస్తుంటే...."

"బాగుపడేద్దామని కట్టుకున్నావా?"

"అవును అవును అవును... ఇంతకూ సినిమాకు వస్తావా లేదా?"

"ఏ సినిమాకు? నిన్న నగరంలో విడుదలైన సినిమాకేనా?"

"ఆం ..."

"అమ్మబాబోయ్. నేరాలేను నీనా. ఆ అసహజమైన, అవాస్తవికమైన కథను, వెకిలి మాటలను చేష్టలను నేను భరించలేను. ప్లీజ్ నన్నిలా ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండనీయవూ?"

"లేదు నువ్వు రావలసిందే."

"నీనా నువ్వు యిన్ని పతివ్రతల సినిమాలు చూశావుగా... భర్తనిలా బాధపెట్టవచ్చా?"

"పతివ్రతల సినిమాలు చూసేది పుణ్యంకోసం. నిన్నెలా కొంగులో నేర్చుకోడానిక్కాదు—లే త్వరగా లేడీస్‌కంటే జెంట్స్‌కే టికెట్స్ ఈజీగా దొరుకుతున్నాయట—"

"అదా అసలు సంగతి" అనుకుంటూ లేచాను.

కమలను పాపకు తోడుగా ఉంచి మేం సినిమాకు వెళ్ళాం.

సినిమానుంచి తిరిగి వచ్చాక ప్రక్కగదిలో డ్రెస్ మార్చుకుంటున్న నీనా-ఏమే బిస్కట్లు తీశావా? అంటూ పాపను తిట్టటం వినిపించింది

మా ఆవిడకున్న అలవాట్లలో ఒకటి బిస్కట్లు తినటం - దువ్వుకుంటూ, డ్రెస్ వేసుకుంటూ, మార్చుకుంటూ, బిస్కట్లు తింటుంది.

"లేదు మమ్మీ" అంటున్నది పాప.

"మనం వెళ్ళేప్పుడు నిలువుగా ఉన్న బిస్కట్ ప్యాకెట్ ఇలా అడ్డం పడి పోయింది. ఒకటో రెండో బిస్కట్లు మాయమైనట్లు నా అనుమానం" అంది నాతో నీనా.

"ఆఁ గాలికి పడి వుండవచ్చు నీనా. ఆ కిటికీ నుంచి వెంటిలేటర్‌నుంచి గాలివస్తుంది కదా ..." అన్నాను అంత చిన్న విషయానికి కంగారెందుకు అన్నట్లు-

"కాదు . . ఇది ఎవరి పనో అయివుంటుంది." అని ప్యాకెట్‌లోని బిస్కట్లు లెక్కబెట్టి "ఒక బిస్కెట్ తక్కువైంది" అంది.

"ఒక్క బిస్కట్టా! నువ్వో పాపో తిని మర్చిపోయి ఉంటారులే" అన్నాను.

"చూడు ...నాతో అనవసరంగా అబద్ధం ఆడించాలని చూడకు. నేనివ్వందే పాప బిస్కట్లు ముట్టుకోదు ఈ ప్యాకెట్‌లోంచి తీసినవి నాలుగేబిస్కట్లు మిగతా వాటిలో ఒక బిస్కట్ మాయమయింది" అంది కోపంగా.

"నేనైతే తీయలేదు మమ్మీ మీరు పిక్చర్‌కు వెళ్ళినప్పటినుంచి ఈ గదిలోకి రాలేదు. వరండాలోనే పడుకున్నా" అంది పాప.

"కమల వచ్చిందా ఈ గదిలోకి?" అని అడిగింది నీనా

కమల అప్పటికే ఇంటికి వెళ్ళిపోయింది.

"కమలా! కమల అలా తీయదు" అన్నాను నేను.

"అది తీయకపోతే మరెలా మాయమవుతుంది? య్రేబ్రాసిముఖంది. దాని పనే.... అదే తీసింది."

"ఆకలి ఉన్నవాళ్ళంతా గడ్డితింటారనుకోవటం పొరపాటు నీనా నీ ఒక్క బిస్కట్ తింటేనే ఆ అమ్మాయి ఆకలి తీరిందా!"

"మరేమయింది?"

"ఎక్కడో పడి ఉంటుంది."

పాప టేబుల్ కింద చుట్టూ వెదికింది. "లేదు మమ్మీ ..." అంది

కమల....

కమల అలా బిస్కట్ తీసి తింటుందా? బాత్‌రూంలో, వరండాలో నీనా, పాప పడేసుకున్న వస్తువులను ఎంతో జాగ్రత్తగా భద్రపరిచే కమల ఆఫ్టరాల్ ఒక్క బిస్కట్ ఒక్క బిస్కట్‌కోసం దొంగతనం చేస్తుందా?

"ఈరోజు ఇదయింది రేపు ఇంకొకటవుతుంది ఈరోజు బిస్కట్ తీసి తింది. రేపు మనం లేకుండా చూసి ఇంకేమైనా ఎత్తుకుపోతుంది. మొదట్నే ఈ బుద్ధిని మాన్పించకపోతే అది గ్లాసులు, చెంబులు. నగలు నట్రా మాయంచేయదూ అమ్మో పోరి.... ఇంతలేదు ఎన్ని దొంగబుద్ధులున్నాయి...." అనసాగింది. అలాంటి మాటలు వింటుంటె మా ఆవిడ బి.ఏ మీద నాకు అప్పుడప్పుడు అనుమానం వస్తూంటుంది.

"నీనా స్టూపిట్ ... నిజానిజాలు తెలుసుకోకుండా ఒకరిని నిందించే అధికారం మనకు లేదు. కమల అలాంటిది కాదు. అలా ఎప్పుడూ చేయదు" అన్నాను కొంచెం కోపంగా.

"ఇది మరీ బాగుంది. పేదవాళ్ళు. అణుక్కునేవాళ్ళంటే మీకు అభిమానం ఉంటే ఉండవచ్చు. కాని పేదోళ్ళంతా మంచివాళ్ళు, సన్మార్గులు, సజ్జనులు అనుకోవడం దురభిమానమే అవుతుంది."

"మెజారిటీనిబట్టి అలా అనుకోవడంలో తప్పులేదు. పేదవాళ్ళను చులకన చేయడం, అసహ్యించుకోడం, తిట్టడం మాత్రం సంస్కారం అనిపించుకోదు."

"పనిమనుషులను భుజాలమీదికి ఎక్కించుకోవడమే సంస్కారమా?"

"పనిమనుషులు అనేది ఒక జాతికాదు నీనా ఈ పనులన్నీ మనం ఒకరి కొకరం చేసుకునే సహకారాలు మనం పనిమనుషులం కాదా? మనల్ని ఇలాగే అసహ్యించుకోవాలా?"

"అందుకే నిన్ను ఆ చెత్తపుస్తకాలన్నీ చదవొద్దు అన్నాను ఇలాంటి చెత్త వాదనలు చేస్తావు ప్రతిదానికి."

"మానవత్వం ఉన్నవాళ్ళెవరూ అవి చెత్తపుస్తకాలు అనరు.

"అంటే నాకు మానవత్వం లేదనా?"

"అది ఎవరికివారు వేసుకోవాల్సిన ప్రశ్న."

"అయితే మరి బిస్కట్ ఎలా మాయమయిందంటావ్?"

"ఆ ప్యాకెట్‌లోనే ఒక బిస్కట్ తక్కువగా వుండొచ్చు. దానికింత గొడవెందుకు?"

"సరే... ఇప్పుడు ప్యాకెట్‌లో ఏడు బిస్కట్లు ఉన్నాయి. వీటిని నేనుగాని బేబిగాని అసలే ముట్టం. రేపు ఇలాగే టేబుల్ మీద ఉంచి చూద్దాం" అంది.

ఉదయం పని చేసి వెళ్ళి సాయంత్రం పాప స్కూలునుంచి వచ్చేవేళకు కమల మా యింటికి వస్తుంది. మేం ఆఫీసులనుంచి వచ్చేసరికి గదులన్నీ ఊడ్చి, శుభ్రంచేసి, పాత్రలు కడిగి స్టౌ అంటించి టీ పెడుతుంది.

ఆ మరునాడు సాయంకాలం మేం వచ్చేసరికి అదే పని చేస్తున్నది కమల.

ఆరోజంతా నేను ఆఫీసులో అన్యమనస్కంగానే ఉండిపోయాను. మాటిమాటికి ఆ బిస్కెట్ విషయమే గుర్తుకు రాసాగింది. తుఫానులో చిక్కుకున్న మొక్కలా కనిపించింది కమల. శ్రద్ధగా పనిచేస్తూ పట్టుదలతో చదువుకుంటున్నది. మా పాపకంటె రెండుమూడేళ్ళు పెద్దది కావచ్చు. ఉద్యోగాలు చేస్తున్న తలిదండ్రులున్న పాప మా పాప.

తల్లి తండ్రి తానే అయి తల్లిని తమ్ముడ్ని పోషిస్తున్నది కమల.

ఆ అమ్మాయి అమాయక రూపం, జాలిచూపులు నా కళ్ళలో మెదిలాయి. ఇంటికి వెళ్ళేసరికి మళ్ళీ బిస్కట్ మాయమైతే నీనా ఆ అమ్మాయిని దొంగ అని అంటుంది. నోటికొచ్చినట్లల్లా తిడుతుంది.

ఆరోజు మా ఆవిడ కూడా ఆఫీసునుంచి తొందరగా బయలుదేరినట్లుంది

ఇద్దరం ఒకేసారి ఇల్లు చేరాము.

కమల దొంగ అని నిరూపించాలని మా ఆవిడ తాపత్రయం.

కమల దొంగకాదు అన్నది నా నమ్మకం.

ఇంటికి రాగానే మా ఆవిడ చేసిన మొదటిపని ప్యాకెట్‌లోని బిస్కట్లు లెక్కబెట్టడం.

కమలవైపు చూశాను తలవంచి గ్లాసుల్లో టీ పోస్తున్నది.

నీనా గబగబా నా దగ్గరకి వచ్చి– "ఏమంటావ్? ఇప్పుడైనా ఒప్పుకుంటావా? ఆరే వున్నాయి బిస్కట్లు అంది."

ఆ గొంతులో విజయగర్వం ఉంది రాక్షసానందం ఉంది.

"నీనా ప్లీజ్ . ఇప్పుడేం మాట్లాడకు- తర్వాత ఆలోచిద్దాం" అని రిక్వెస్ట్ చేశాను

నావైపు కోపంగా చూసింది.

"శత్రువుకు రక్షణ ఇస్తున్నావు" అన్నట్లు కళ్ళతో హెచ్చరించింది.

ఆ కళ్ళు అగ్నిగోళాల్లా గున్నాయి . మండుతున్న తోపుల్లాగున్నాయి.

కమల ఆరోజు పని పూర్తిచేసి వెళ్ళాక పాపను పిలిచి అడిగాను.

"కమల బిస్కట్ తీయటం నువ్వు చూశావా పాపా?"

"లేదు నాన్నా!"

"కమల ఆ గది ఊడ్చేప్పుడు నువ్వెక్కడున్నావ్?"

"ప్రక్కగదిలో . మమ్మీ చెప్పిందిగా కమలకు తెలియకుండా ఏంచేసేది చూడమని! కమల అసలు బిస్కట్‌ప్యాకెట్ ముట్టనేలేదు."

"నువ్వు రాగానే చూశావా బిస్కట్లు ఎన్ని ఉన్నాయో?"

"చూశాను నాన్నా. ప్యాకెట్ పడిఉంది బిస్కట్స్ ఆరే వున్నాయి"

"విన్నావా నీనా! ఇప్పుడేమంటావ్? ఇంటికి తాళంవేసింది నువ్వే కదా! తాళంచెవి ఉంది పాపదగ్గర"

"ఏమిటో ఈ వెధవ గొడవతో నా తల వేడెక్కేట్లుంది" అంటూ చన్నీళ్ళతో స్నానం చేయటానికి బాత్‌రూంకు వెళ్ళింది నీనా.

ఎంత ఆలోచించినా ఆ బిస్కట్ ఎలా మాయమయిందో నాకు అర్థం కాలేదు. ఒక్క బిస్కటు మాత్రమే మాయమవడమేమిటి?

ఆ మరునాడు ఆదివారం.

మధ్యాహ్నం నేను, మాఆవిడ, పాప భోజనానికి కూర్చున్నాం

కమల ప్లేట్లు కడుగుతున్నది.

మా ఆవిడ ఆశ్చర్యంగా పక్కగదిలోకి చూడటం చూసి నేను అటు చూశాను.

టేబుల్ మీదికి చేరిన ఒక పిచ్చుక ముక్కుతో బిస్కటుప్యాకెటును కొడుతున్నది. ప్యాకెట్ పక్కకు పడిపోయింది. ముందుకు జారిన బిస్కటును ముక్కున కరుచుకొని ఆ పిచ్చుక పైకి యెగిరింది.

"అమ్మో! పిచ్చుక చూశావా?" అని ఆశ్చర్యంగా నీనా.

"చూస్తూనే ఉన్నా " అన్నాను మెల్లగా.

కడిగిన ప్లేట్లు తెచ్చి కమల మా ముందు పెట్టింది.

ఆ ప్లేట్లలో మా ముఖాలు కనిపిస్తున్నాయి.

నీనావైపు చూశాను.

కమలను చూస్తోంది.

ఆ కళ్ళలో ఇప్పుడు అగ్నిగోళాలు లేవు.

ఆ చూపుల్లో ఇప్పుడు సూదులు లేవు.

దయ ఉంది.

జాలి ఉంది

ప్రేమ ఉంది

ఆ క్షణం ఒక పరిణామానికి నాంది కావాలనే ..

ఆ పరిణామం క్షణికం కాకూడదనే ఆశ నా కళ్ళలో ఉంది.

ఆంధ్రజ్యోతి వారపత్రిక
15-12-78